



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
29 సెప్టెంబర్ 2024
పేజీలు: 02




# ఐపీఎల్‌లో ప్లేయర్లపై కాసుల వర్షం!




ఐపీఎల్ 2025 సీజన్ వేలం రిటెన్షన్ పాలసీ ఖరారైంది. బీసీసీఐ, టీమ్ ఓనర్ల నుంచి అనేక సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత మెగా వేలానికి ముందు ప్రతి జట్టుకు ఐదు రిటెన్షన్స్, ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఆప్షన్‌ను ఇవ్వాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ శనివారం నిర్ణయించింది. 2022 మెగా వేలంలో నలుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకునేందుకు అనుమతించారు. ఈసారి ఆ సంఖ్య ఐదుకు పెరగడంతో పాటు ఆర్‌టీఎంను ఉపయోగించే అవకాశం కూడా కల్పించారు. రిటెన్షన్ పాలసీలో భాగంగా ఒక ఫ్రాంచైజీ తమతోనే కొనసాగించే తొలి ఆటగాడికి (తొలి రిటెన్షన్) రూ. 18 కోట్లు, రెండో ప్లేయర్‌కు రూ. 14 కోట్లు, మూడో ఆటగాడికి రూ. 11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ జట్టు మరో రెండు రిటెన్షన్స్ కూడా ఉపయోగించాలని నిర్ణయిస్తే నాలుగో రిటెన్షన్స్‌కు రూ. 18 కోట్లు, చివరి దానికి రూ. 14 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఓ ఫ్రాంచైజీ ఐదుగురు ప్లేయర్లను రిటైన్ చేసుకుంటే ఆ జట్టు వేలం ఖాతా (రూ. 120 కోట్లు) నుంచి రూ. 75 కోట్లు మినహాయిస్తారు. దీంతో మరో 15 మంది ప్లేయర్లను కొనుగోలు చేయడానికి వేలంలో సదరు ఫ్రాంచైజీకి రూ. 45 కోట్లు మాత్రమే మిగులుతాయి. కాగా, తమ జట్టు ఆటగాడిని వేరే ఫ్రాంచైజీ కొనుగోలు చేస్తే ఆర్‌టీఎం ఉపయోగించి ఆ మొత్తాన్ని చెల్లించి సదరు ప్లేయర్‌ను తమతోనే అట్టిపెట్టుకోవచ్చు. రిటెన్షన్‌లో స్వదేశీ, విదేశీ క్రికెటర్లు ఎవరినైనా ఎంచుకోవచ్చని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఆదివారం జరిగే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం రిటెన్షన్ పాలసీకి ఆమోదం తెలపనుంది. నవంబర్ రెండో వారంలో మెగా వేలం తేదీని కూడా ఖరారు చేసే చాన్సుంది. ఐసీసీ సమావేశాలకు ఇండియా నుంచి ఇద్దరు ప్రతినిధులను ఎంపిక చేయడమే ప్రధాన ఎజెండాగా బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) ఆదివారం జరగనుంది. ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన జై షా స్థానంలో బీసీసీఐ కొత్త సెక్రటరీ ఎంపిక విషయం ఎజెండాలో లేకపోవడం గమనార్హం. ఇక, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లోకి ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) నుంచి ఒక ప్రతినిధి చేరికను బీసీసీఐ ఏజీఎం ఆమోదించనుంది. ప్రస్తుత ప్రతినిధి వి. చాముండేశ్వర్ నాథ్ ఈ పోస్టులో కొనసాగుతాడని తెలుస్తోంది. జనరల్ బాడీ నుంచి మరో ఇద్దరు ప్రతినిధులుగా ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్, అవిషేక్ దాల్మియాను నామినేట్ చేయనున్నారు. కాగా, అన్షుమాన్ గైక్వాడ్ మరణంతో ఖాళీ అయిన ఐసీఏ ప్రెసిడెంట్ పోస్టును మాజీ టెస్టు క్రికెటర్ యజుర్వేంద్ర సింగ్ చేపట్టనున్నాడు. 2024--25 సీజన్ వార్షిక బడ్జెట్, క్రికెట్ కమిటీ వంటి సబ్-కమిటీల నియామకాలను బీసీసీఐ ఏజీఎం ఆమోదించనుంది. ఐపీఎల్ క్రికెటర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీలతో కాంట్రాక్టు ద్వారా భారీ మొత్తం ఆర్జిస్తున్న ఆటగాళ్లకు కొత్తగా మ్యాచ్ ఫీజులు కూడా అందించాలని నిర్ణయించింది. ఐపీఎల్ ప్లేయర్లకు ప్రతీ మ్యాచ్‌కు రూ. 7.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ మ్యాచ్ ఫీజు ఖరారు చేసింది. 2025 సీజన్ నుంచే ఇది అమల్లోకి రానుంది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ జై షా శనివారం సోషల్ మీడియా వేదికగా శనివారం ప్రకటించారు. ఒక సీజన్‌లో అన్ని లీగ్ మ్యాచ్‌లు ఆడే క్రికెటర్‌కు రూ. 1.05 కోట్ల మొత్తం లభిస్తుంది. ఆ ఫ్రాంచైజీతో తను ఒప్పందం చేసుకున్న మొత్తానికి ఇది అదనం. మ్యాచ్ ఫీజుల కోసం ఒక్కో ఫ్రాంచైజీ సీజన్‌కు రూ. 12.60 కోట్లు కేటాయిస్తుంది. ఫ్రాంచైజీలకు గతంలో పోలిస్తే ఎక్కువ ఆదాయం వస్తున్నందున ఆటగాళ్లను ఆర్థికంగా ప్రోత్సహించాల్సిన అవసరం గురించి ఐపీఎల్, బోర్డు పెద్దలు ఆయా జట్లను ఒప్పించి ఈ కొత్త పాలసీని తీసుకొచ్చినట్టు తెలుస్తోంది.



## సుద్దాల మల్లిక్ తేజపై లైంగిక వేధింపులు కేసు

ఈ మధ్య కాలంలో లైంగిక వేధింపులకు సంబంధించి సెలబ్రిటీలపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పై అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్ కేసు పెట్టగా..ఆ తర్వాత యూట్యూబ్ ఫేమ్ హర్ష సాయి కూడా ఓ అమ్మాయిని లైంగికంగా వేధించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా జగిత్యాల జిల్లాకు చెందిన ఫోక్ సింగర్, రైటర్ , సుద్దాల మల్లిక్ తేజపై మామిడి మౌనిక అనే సింగర్ కేసు పెట్టింది. యూట్యూబ్ ఛానెల్ లో ఫోక్ సాంగ్స్ పాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా సింగర్ గా గుర్తింపు తెచ్చుకున్న మౌనిక.. సుద్దాల మల్లిక్ తేజ తనను మోసం చేశాడంటూ పోలీసులను ఆశ్రయించింది. ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి లొంగదీసుకున్నాడని.. స్టూడియోలోనే తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అంతటితో ఆగకుండా తన యూట్యూబ్ ఛానెల్ ఐడీ, పాస్ వర్డ్ లు మార్చి వేధింపులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. సదరు యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పెరిగిన చికెన్ ధర

నాన్‌వెజ్ ప్రియులకు బ్యాడ్‌న్యూస్. తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధర మళ్లీ పెరుగుతోంది. ఈనెల మొదట్లో కేజీ చికెన్ స్కిన్‌లెస్ రేట్ రూ.160-180 మధ్య పలికింది. 2 వారాల కిందట అది రూ.200 దాటగా గత వారం రూ.236కు చేరింది. ప్రస్తుతం కేజీ చికెన్ స్కిన్‌లెస్ రేట్ రూ.243గా ఉంది. దసరా పండుగ నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరి చికెన్ రేట్ మీ ప్రాంతంలో ఎంత ఉంది?.



## నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

గుండె జబ్బులు, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని WHO, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ ఏర్పాటయింది. 1999లో తొలిసారిగా వరల్డ్ హార్ట్ డే నిర్వహించారు. అలా 2000 నుంచి 2010 వరకు సెప్టెంబరులో చివరి ఆదివారం నిర్వహిస్తూ వచ్చారు. 2011 నుంచి SEP 29న జరుపుతున్నారు.

### గుండె ఆరోగ్యంగా ఉండాలంటే?

* వాకింగ్, రన్నింగ్, యోగ వంటి వ్యాయామాలు చేయాలి.
* అతిగా వేయించిన ఆహారాలు (డీప్ ఫ్రైడ్ ఫుడ్స్) తీసుకోవద్దు.
* కొలెస్ట్రాల్, బ్లడ్ గ్లూకోస్, బ్లడ్ ప్రెషర్ తరచుగా చెక్ చేసుకుంటూ, నియంత్రణలో ఉంచుకోవాలి.
* ధూమపానం, మద్యపానం చేయవద్దు
* అధిక ఒత్తిడి కూడా గుండె జబ్బులకు దారితీస్తుంది. ఒత్తిడిని తగ్గించుకునేందుకు మెడిటేషన్, బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చేయడం మంచిది.



## నేపాల్‌లో వరదలు.. 100 మందికి పైగా మృతి

నేపాల్‌లో వరదలకు ఇప్పటివరకు 112 మంది మృతి చెందినట్లు ఆ దేశంలోని సాయుధ దళాలు తెలిపాయి. పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు పేర్కొన్నాయి. నేపాల్‌లో గత కొన్ని రోజులుగా వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగిపోయాయి. దీంతో అక్కడి జనజీవనం స్తంభించింది. వరద బాధితులను సహాయక దళాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వరదల ప్రభావం బిహార్‌పై పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి కొన్ని నదులు బిహార్‌లోకి ప్రవహిస్తాయి. ఆ నదులకు వచ్చే ఆకస్మిక వరదలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలను ముంచెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## వక్ఫ్ బోర్డును రద్దు చేయాలంటూ ర్యాలీ



హిమాచల్ ప్రదేశ్‌లోని సంజౌలీలో అక్రమంగా నిర్మిస్తున్న మసీదును కూల్చివేయాలని కోరుతూ దేవభూమి సంఘర్ష్ సమితి హమీర్‌పూర్‌లో నిరసన ర్యాలీ చేపట్టింది. దీనిలో పాల్గొన్న 46 ఏళ్ల విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యుడొకరు గుండెపోటుతో కన్నుమూశారు. వక్ఫ్ బోర్డును రద్దు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. దేవభూమి సంఘర్ష్ సమితి పిలుపు మేరకు సిమ్లా, హమీర్‌పూర్, మండీ, చంబా, నహన్ జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. కార్యకర్త వరిందర్ పర్మార్ స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని వెంటనే పోలీసు వాహనంలో హమీర్‌పూర్ మెడికల్ కాలేజీకి తీసుకెళ్లారు.




## హిందీలో దేవర 7 కోట్లు వసూళ్లు

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన అవైటెడ్ సినిమానే "దేవర". మరి పాన్ ఇండియా లెవెల్లో గట్టి ప్రమోషన్స్ నడుమ రిలీజ్ కి ఈ చిత్రాన్ని తీసుకురాగా డే 1 కి చాలా చోట్ల తారక్ భారీ రికార్డులు సెట్ చేసాడు. మరి అలాగే నార్త్ ఇండియా మార్కెట్ లో కూడా తక్కువ బజ్ తోనే సాలిడ్ ఓపెనింగ్స్ కి దేవర ఇప్పుడు అందుకున్నట్టు తెలుస్తుంది. దేవర డే 1 గా ఒక్క హిందీలోనే 7 కోట్లకి పైగా నెట్ వసూళ్లు సాధించినట్టు తెలుస్తోంది. ఇది మాత్రం సర్ప్రైజింగ్ నెంబర్ అనే చెప్పాలి. మరి ఈ సినిమాకి అనిరుద్ సంగీతం అందించగా ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ వారు నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.



## సంపద సృష్టి లేదు.. అంతా దోపిడీనే

కూటమి ప్రభుత్వంలో సంపద సృష్టి లేదని, అంతా దోపిడీయేనని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. 'మళ్లీ ₹3000కోట్ల అప్పు. ఈ డబ్బంతా ఎక్కడికి పోతుంది? ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం దాదాపు ₹50,000crపైగా అప్పు తెచ్చింది. చంద్రబాబు సీఎం అయ్యే నాటికి ఖజానాలో ₹7000cr ఉన్నాయి. కేంద్రం నుంచి వచ్చిన డబ్బు కూడా ఉంది. కానీ జగన్ అమలు చేసిన 38 సంక్షేమ పథకాల్లో ఒక్కటి కూడా చంద్రబాబు కొనసాగించట్లేదు' అని ట్వీట్ చేశారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

# సత్యం సుందరం రివ్యూ



కార్తీ, అరవింద్ స్వామిల నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ఇద్దరూ క్లాస్‌గానూ కనిపించగలరు.. మాస్‌గానూ మెప్పించగలరు. ఇలాంటి నటులతో ప్రేమ్ కుమార్ వంటి ఓ సెన్సిబుల్ డైరెక్టర్ ఎలాంటి ఎమోషన్స్‌ను పండించి ఉంటాడా? అని అంతా అనుకునేలా సత్యం సుందరం సినిమా మీద మంచి పాజిటివ్ వైబ్ అయితే ఏర్పడింది. 96 మ్యాజిక్ మళ్లీ ఇక్కడ రిపీట్ అయిందా? లేదా? సత్యం సుందరం ఆడియెన్స్‌ను ఏ మేరకు ఆకట్టుకుంటుంది అన్నది ఓ సారి చూద్దాం.

సత్యం (అరవింద్ స్వామి) నాన్న రామలింగం (జయ ప్రకాష్)కు తోబుట్టువులు చేసిన అన్యాయంతో చేతిలో ఏం మిగలకుండా పోతుంది. చివరకు ఉన్న ఊరిని, సొంత ఇంటిని వదిలి వెళ్లాల్సి వస్తుంది. ఆ ఇంటితో సత్యం మనసు పెనవేసుకుని ఉంటుంది. అతి కష్టంగానే సత్యం ఆ ఇంటిని, ఊరిని విడిచి వెళ్తాడు. తనకు ఇష్టమైన చిన్నాన్న కూతురు భువనకి కూడా దూరంగా వెళ్తాడు. ఊరి వదిలి వెళ్లే క్రమంలో ఇష్టమైన సైకిల్‌ను కూడా అక్కడే విడిచి వెళ్తాడు. 22 ఏళ్లు పుట్టిన ఊరికి, బంధువులకు సత్యం ఫ్యామిలీ దూరంగానే ఉంటుంది. తన చెల్లి భువన పెళ్లి కారణంగా సొంతూరికి రావాల్సి వస్తుంది. ఆ పెళ్లిలో బావ అంటూ సుందరం (కార్తీ) సత్యాన్ని తగులుకుంటాడు. కానీ సత్యానికి మాత్రం అతను ఎవరో తెలీదు. చిన్న నాటి రోజులు కూడా గుర్తుకు రావు. కనీసం అతని పేరు కూడా సత్యంకు తెలియదు. పేరు తెలియకుండా సత్యం అతనితో ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఈ ప్రయాణంలో సత్యం తెలుసున్నది ఏంటి? తనను తాను ఏవిధంగా ఆవిష్కరించుకున్నాడు? కనీసం అతని పేరు అయినా సత్యం తెలుసుకున్నాడా? అతనితో సత్యంకి ఉన్న బంధం ఏంటి? గతంలో వదిలేసి వెళ్లిన సైకిల్ కథ ఏంటి? చివరకు ఏం జరిగింది? అన్నదే కథ. సత్యం, సుందరం ప్రయాణమే ఈ కథ. ఇలాంటి ఓ సెన్సిబుల్ కథను రాయడం చాలా కష్టం. పాయింట్ పరంగా చూస్తుంటే ఇది చిన్న కథలానే అనిపిస్తుంది. కానీ ఈ పాయింట్ చుట్టూ అల్లుకున్న కథనం, సీన్లు కొన్ని సార్లు కంటతడి పెట్టేలా చేస్తాయి. ఇంకొన్ని సార్లు సత్యం పాత్ర ఫీల్ అయినట్టే.. నసగా అనిపిస్తుంది. ముఖ్యంగా తెలుగు ఆడియెన్స్‌కు కొన్ని సీన్లు ఎక్కకపోవచ్చు. అది అక్కడి వాళ్లకి కామెడీ కావొచ్చు.. అది వర్కౌట్ కావొచ్చు. కానీ మన తెలుగు ప్రేక్షకులకు అంత నీరసంగా, నిదానంగా సాగే కథనం అంటే కాస్త కష్టమే అని చెప్పొచ్చు. అసలే మన ఆడియెన్స్ ఇప్పుడు కేజీయఫ్, సలార్, దేవర, పుష్ప లాంటి హై యాక్షన్, మాస్ మూవీల ట్రాన్స్‌లో ఉన్నారు. ఇలాంటి టైంలోనూ కొన్ని సెన్సిబుల్, ఎమోషనల్ స్టోరీలను ఆదరించారు. తమిళంలో వచ్చిన 96 సినిమాను మన ఆడియెన్స్ మెచ్చుకున్నారు. కానీ అదే మూవీని జాను అంటూ రీమేక్ చేస్తే పెదవి విరిచారు. ఇప్పుడు ఇక్కడ కూడా అదే సమస్య రావొచ్చు. ఈ మూవీ తమిళ ఆడియెన్స్‌కు ఎక్కొచ్చు. కానీ తెలుగు ఆడియెన్స్‌కు ఎక్కడం మాత్రం కష్టంగా అనిపిస్తుంది. సత్యం సుందరంలో చాలా లాజిక్స్ మిస్ అవుతాయి. భువనకు అన్నయ్య అంటే అంత ఇష్టం ఉన్నప్పుడు.. సత్యంకు తన చెల్లి అంటే ఇష్టం ఉన్నప్పుడు అన్ని ఏళ్లలో ఒక్కసారి కూడా ఎందుకు కలవరు.. సత్యం అంటే అంత ప్రేమ ఉన్న సుందరం ఎప్పుడూ కూడా కలిసే ప్రయత్నం చేయడా? వాళ్లేమీ ఇతర దేశాల్లో లేరు కదా.. అనే లాజిక్స్ కూడా మధ్యలో తట్టొచ్చు. కానీ అలాంటి లాజిక్స్ వస్తే తప్ప మన ఆడియెన్స్‌ది అయితే కాదు. ఇక పెళ్లిలో కామెడీ సీన్ అన్నట్టుగా.. సుందరం పెళ్లిలో ఏదో జరిగినట్టు.. ఏదో కామెడీ సీన్ ఉన్నట్టుగా బిల్డప్ ఇస్తారు. కానీ తరువాత దాని ఊసే ఉండదు. ఇలా చాలా సీన్లు మనకు ఎక్కవు. రిసెప్షన్ స్టేజ్ మీద అన్నా, చెల్లి ఎమోషన్ సీన్ బాగా వర్కౌట్ అయింది. చూసే ఆడియెన్స్‌కి కన్నీరు రావొచ్చు. సెకండాఫ్‌లో సత్యం, సుందరం మధ్య వచ్చే చాలా సీన్లు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. చూసే ఆడియెన్‌కు కార్తీ పేరు సుందరం అని తెలుస్తుంది. కానీ సత్యం పాత్ర ఆ పేరుని కనుక్కునేందుకు పడే తాపత్రయం, కనుక్కోలేకపోతోన్నాను అనే పడే బాధ, కనుక్కున్నాక సంతోష పడే సీన్లు ఇలా చాలా వరకు కనెక్ట్ అవుతాయి.ఇంత వరకు సీన్ల గురించి చెప్పకున్నాం. కానీ ఈ చిత్రానికి సత్యం, సుందరం కారెక్టర్లను ప్రేమ్ కుమార్ రాసుకున్న తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. సత్యం మనుషుల్ని దూరం పెట్టి ఏకాంతంగా బతుకుతుంటాడు. కానీ సుందరం మాత్రం రేలంగి మామయ్యలా మనుషులు మంచోళ్లు.. మనుషులంటేనే మంచోళ్లు అనేట్టుగా జాలీగా బతికేస్తుంటాడు. అందరినీ మనస్ఫూర్తిగా పలకరిస్తూ, అందరికీ ప్రేమ, నవ్వులు పంచుతూ ఉంటాడు. ఈ రెండు పాత్రలను రాసుకున్న తీరు.. సుందరం పాత్రకు సత్యం కారెక్టర్‌తో ఇచ్చిన ఎలివేషన్ బాగుంటుంది. మనిషి అంటే అలా బతకాలా? మనుషులంతా అలా బతకాలా? అంటూ సుందరం పాత్ర గురించి సత్యం చెప్పే సీన్ బాగుంటుంది. అలాంటి డైలాగ్స్ ఎన్నో కూడా మనసుకు హత్తుకునేలా ఉంటాయి.సాంకేతికతంగా ఈ చిత్రం మళ్లీ మెస్మరైజ్ చేస్తుంది. గోవింద్ వసంత్ పాటలు అంతగా గుర్తుండకపోయినా.. ఆర్ఆర్ మాత్రం ఎమోషనల్‌గా టచ్ అవుతుంది. కెమెరా వర్క్ చాలా సహజంగా కనిపిస్తుంది. హాయిగా అనిపించేలా ఉంటుంది. సూర్య, జ్యోతికలు నిర్మాతలుగా తమ అభిరుచిని చాటుకున్నారు. బాక్సాఫీస్ వద్ద కమర్షియల్‌గా సక్సెస్ అవుతాయో లేదో చెప్పలేం. సత్యం సుందరం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని రాబట్టుకుంటుందో చూద్దాం..



## తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్

తమిళనాడు మంత్రివర్గం పునర్వ్యస్థీకరణకు ముహూర్తం ఖరారైంది. డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తనయుడు, ఉదయనిధి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించనున్నారు. సీఎం స్టాలిన్ చేసిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలకు గవర్నర్ ఆర్ఎన్ రవి శనివారం ఆమోదం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఉదయనిధి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లి, రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని మళ్లీ క్యాబినెట్‌లోకి తీసుకోనున్నారు. అదేవిధంగా డా.గోవి.చెళియన్, ఆర్.రాజేంద్రన్, ఎస్ఎం నాజర్‌లనూ మంత్రివర్గంలో చేర్చుకోనున్నారు. మనో తంగరాజ్ సహా ముగ్గురు మంత్రులను క్యాబినెట్ నుంచి తప్పించారు.



## ఫ్యామిలీ డిజిటల్ కార్డులో యజమానిగా మహిళే

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో మహిళలనే ఇంటి యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలను కార్డుల వెనుకభాగంలో ముద్రించాలని సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ)లపై శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై ఈ నెల 25 నుంచి 27 వరకు రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించిన అధికారుల బృందం... తమ అధ్యయనానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. కార్డుల రూపకల్పనలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను సీఎంకు వివరించింది. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు సీఎం పలు ఆదేశాలు, సూచనలు చేశారు. ప్రస్తుతమున్న రేషన్, ఆరోగ్యశ్రీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా కుటుంబాలను నిర్ధారించాలన్నారు. ఇతర రాష్ట్రాల కార్డు ల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిష్కరించాలని ఆదేశించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి సమాచారం సేకరించాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.



## మృణాల్ హాట్ లుక్

మృణాల్ ఠాకూర్ అంటే ట్రెడిషనల్ డ్రస్సుల్లో బావుంటుందని కొంత మంది ఫిక్స్ అయ్యారు. కానీ, ఆవిడ మోడ్రన్ డ్రస్సుల్లోనూ అదుర్స్ అనిపిస్తున్నారు.'సీతా రామం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతగా ముద్ర వేసుకుంది మృణాల్ ఠాకూర్. తర్వాత నటించిన 'ఫ్యామిలీ స్టార్', 'హాయ్ నాన్న' కూడా హిట్టు సినిమాలే. ఆవిడను పక్కింటి అమ్మాయిలా, సంప్రదాయానికి చిరునామాలా చూసే జనాలు ఎక్కువ మంది. తెలుగులో మొదటి సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదలైనవి చూస్తే... మృణాల్ ఠాకూర్ చీరల్లో సూపర్ ఉంటారని అర్థం అవుతుంది. అయితే... మోడ్రన్ డ్రస్సుల్లోనూ సూపర్ ఉంటారని ఈ ఫోటోలు చూస్తే తెలుస్తుంది.దుబాయ్‌లో జరుగుతున్న ఐఫా అవార్డుల్లో మృణాల్ ఠాకూర్ ఈ డ్రస్ లో సందడి చేశారు. మృణాల్ మోడ్రన్ లుక్ కూడా బావుంది కదూ!సాధారణంగా అవార్డుల్లో రెడ్ కార్పెట్ ఉంటుంది కదూ! కానీ, ఐఫా కొత్తగా ఆలోచించి గ్రీన్ కార్పెట్ ఏర్పాటు చేసింది.



## మధ్యప్రదేశ్‌లోని మైహర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### తొమ్మిదిమంది మృతి

మధ్యప్రదేశ్‌లోని మైహర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో నిండిన ఒక బస్సు రోడ్డు పక్కనే నిలిపివుంచిన ఉన్న హైవా వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారితో సహా తొమ్మిదిమంది మృతిచెందారు. 24 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన వారిని మైహర్, అమర్పతన్, సత్నా జిల్లా ఆసుపత్రులకు తరలించారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన బస్సు ప్రయాగ్‌రాజ్ నుంచి రేవా మీదుగా నాగ్‌పూర్ వెళుతోంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదం జరిగిన సమయంలో బస్సు వేగంగా వెళుతోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 53 సీట్లున్న ఈ బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం సమాచారం అందిన వెంటనే, నాదన్, మైహర్ పోలీసులు ఎస్‌డిఎం వికాస్ సింగ్, తహసీల్దార్ జితేంద్ర సింగ్ పటేల్, ఎస్పీ సుధీర్ కుమార్ అగర్వాల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా ధ్వంసమైంది. జేసీబీ, గ్యాస్ కట్టర్ సహాయంతో బస్సు డోర్ కట్ చేసి, ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. ప్రయాణికుల్లోని కొందరు కిటికీలో నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## టీమిండియా టీ20 స్క్వాడ్..

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ముగియకముందే పొట్టి సిరీస్‌పై టీమిండియా దృష్టి సారించనుంది. అక్టోబర్‌లో జరుగబోయే టీ20 సిరీస్ కోసం బీసీసీఐ స్క్వాడ్‌ను ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్లు సూర్యకుమార్ యాదవ్ సారథిగా 15మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేస్ సంచలనం మయాంక్ యాదవ్‌లు డెబ్యూ క్యాప్ అందుకోనున్నారు.దులీఫ్ ట్రోఫీలో సెంచరీతో మెరిసిన ఇషాన్ కిషన్‌కు మాత్రం మరోసారి నిరాశ తప్పలేదు. అతడి బదులు వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, జితేశ్ శర్మలను తీసుకున్నారు. అక్టోబర్ 6 నుంచి భారత్, బంగ్లాల మధ్య పొట్టి సిరీస్ మొదలవ్వనుంది.

భారత స్క్వాడ్ : సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డి, శివం దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్,